




అడవికి రక్షణ.. ఫైర్‌లైన్స్






గూడూరు అభయారణ్యంలో ఫైర్‌లైన్స్ దృశ్యాలు(ఫైల్)

మహబూబాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అడవులకు పెట్టింది.. పేరు.. వేసవిలో జరిగే అగ్ని ప్రమాదాలతో అటవీసంపద కాలి బూడిదవుతోంది. ఏటా అగ్ని ప్రమాదాల వల్ల వేలాది వృక్షాలు దగ్ధమవుతున్నాయి. అడవుల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై ప్రజలకు పూర్తి అవగాహన కరువైంది. సమీప గ్రామాల ప్రజలు వంటచెరువుకు, పశువుల మేత కోసం వెళ్లిన సమయంలో నిప్పు పెడుతుండడంతోనూ అడవులు కాలిపోతున్నాయని అధికారులు గుర్తించారు. తునికాకు సేకరణలో భాగంగా ప్రూనింగ్ (కొమ్మకొట్టే కార్యక్రమం) చేస్తున్న సమయంలో ఏటా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్న విషయం విదితమే. వాటి నివారణకు అటవీశాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలుతీసుకుంటున్నా అటవీ సంపదకు నష్టం జరుగుతూ వస్తోంది. అడవికి వెళ్లిన వారు బీడీలు, సిగరేట్లు, చుట్టలు కాల్చిన తర్వాత వాటిని ఆర్పివేయకుండా పడేయడంతో నిప్పంటుకుని,అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీని నుంచి అడవులను రక్షించేందుకు అటవీశాఖ అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ఎక్కడ అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నా శాటిలైట్ ద్వార కనిపెట్టి మంటలను ఆర్పివేస్తున్నారు.

ఈ విధానంలో మంటలు అంటుకున్న సమాచారం సంబంధిత రేంజ్‌పరిధిలోని బీట్ అధికారికి మెసేజ్ అందుతుంది. వెంటనే సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పివేస్తారు. ఇప్పటికే అటవీప్రాంతంలోకి ఎవరూ వెళ్లవద్దని, పశువుల కాపర్లు, స్మగ్లర్లు, అగ్గిపెట్టెలు, నిప్పు రాజేసే లైటర్లతో అడవిలోకి వెళ్తే.. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనికి తోడు అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు మరెన్నో చర్యలు చేపడుతోంది. మహబూబాబాద్ జిల్లాలో ఎండిన ఆకుల వేరు చేయడం.. ఫైర్‌లైన్ ఏర్పాటు కోసం ప్రభుత్వం లక్షలా ది రూపాయలను ఖర్చు చేస్తోంది.



బ్లోయర్‌తో మంటలను ఆర్పుతున్న అటవీ సిబ్బంది (ఫైల్)

- ప్రత్యేక దృష్టిసారించిన అటవీశాఖ
- ఎండల తీవ్రత నేపథ్యంలో చర్యలు
- అగ్నిప్రమాదాల నివారణకు 300 కిలోమీటర్ల ఫైర్‌లైన్
- ప్రజలకు చైతన్య కార్యక్రమాలు
- జిల్లాలో లక్షా 40 వేల హెక్టార్లలో అడవులు

జాగ్రత్త చర్యలు..

వేసవికాలంలో అడవుల్లో అగ్ని రాజుకొని వనసంపద కాలిపోతున్న నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా అటవీ ప్రాంతంలో ఫైర్‌లైన్లు ఏర్పాటు చేసి వృక్షాలు కాలకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. అడవుల్లో చెట్ల నుంచి రాలిన ఎండు ఆకులను సుమారు 300 కిమీ.. దూరం వరకు పేర్చి నిప్పంటిస్తున్నారు. దీంతో ఫైర్‌లైన్ ఏర్పాటవుతుంది. ఒకవేళ ఆకస్మాత్తుగా అడవిలో మంటలు చెలరేగినా ఫైర్‌లైన్ వరకు మంటలు వ్యాపిస్తాయి. మిగిలిన అటవీప్రాంతం మొత్తం సంరక్షిచబడుతుంది.

ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసేది ఇలా..

అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణలో భాగంగా అటవీ శాఖ అధికారులు అటవీప్రాంతంలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తారు. అటవీప్రాంతంలోని కాలిబాటలో ఐదుమీటర్ల వెడల్పుతో వీటినిఏర్పాటు చేయడం జరుగుతుంది. చుట్టుపక్కల ఉన్న ఎండిన ఆకులను కాలిబాటలో పరిచి నిప్పంటిస్తారు. ఒకవేళ ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి మంటలు చేలరేగినా ఈ దారి వరకే మంటలు వ్యాప్తి చెంది, ఆరిపోతాయి. మిగతా ప్రాంతానికి మంటలు వ్యాప్తి చెందకుండా ఫైర్‌లైన్స్ అరికడతాయి. అడవుల రక్షణకు ఏటా అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో వేసవి ప్రారంభంలో ముందస్తు చర్యలు చేపడతారు. ఫైర్‌లైన్స్ ద్వారా దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయడంతో అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సారి ఫైర్‌లైన్స్ టార్గెట్‌ను తగ్గించడం గమనార్హం.

వేసవికాలం దృష్ట్యా..

వేసవి కాలంలో అడవులకు నిప్పంటుకుంటే నష్టం

మిగతా 8వ పేజీలో...

శాటిలైట్ ద్వారా సమాచారం

అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే.. వెంటనే సమాచారం అందించేందుకు అటవీ శాఖ ప్రధాన కార్యాలయంలో ఫైర్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. శాటిలైట్ ద్వారా వచ్చే సమాచారాన్ని చేరవేస్తుంది. మహబూబాబాద్ జిల్లాలో ఎక్కడైనా అటవీప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించి, మంటలు చేలరేగితే ఆ ప్రాంతానికి తక్షణమే సమాచారం అందించే వీలు ఉంటుంది. దీంతో ఫారెస్టు అధికారులు అప్రమత్తమై ఆయా ప్రాంతాలకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువస్తారు.

జిల్లాలో అడవి విస్తీర్ణం..

మహబూబాబాద్ జిల్లాలో అడవుల విస్తీర్ణం లక్షా 40 వేల హెక్టార్లు వ్యాపించి ఉంది. అడవుల శాతం 45 కాగా, 80 సెక్షన్లు, 150 బీట్లు ఉన్నాయి. ఏటా ఈ ఫైర్‌లైన్లు ఏర్పాటుతో అడవులు అగ్నికి ఆహుతి కాకుండా ఉండేందుకు దోహదం చేస్తాయి. దీంతో అటవీ సంపదకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది. అటవీ ప్రాంతంలో మంటలు అంటుకున్న వెంటనే అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేసి మంటలను అదుపులోకి తెస్తున్నారు. అంతే కాకుండా మంటలు అంటుకున్న విషయం ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా వారు కూడా డెహ్రాడూన్‌లో ఉన్న ఉపగ్రహం ద్వారా గుర్తించి ఏరియా అటవీ అధికారులకు సమాచారాన్ని అందజేస్తున్నారు.

అడవికి నిప్పు పెట్టొద్దు

చంద్రశేఖర్, ఎఫ్‌డీవో, గూడూరు



అటవీ ప్రాంతంలోకి వెళ్లే పశువుల కాపర్లు, రోడ్డు మార్గం ద్వారా వెళ్లే ప్రయాణికులు ఉద్దేశపూర్వకంగా లేదా ఆద మరిచి కానీ అడవిలో నిప్పు పెట్టొద్దు. మంటలు వ్యాప్తి చెందేందుకు కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. అడవుల్లో నిప్పు పెట్టినట్లయితే శిక్షగా పరిగణించి చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా అటవీ ప్రాంతం వెళ్లేవారు ఎట్టి పరిస్థితుల్లోను మంటలు పెట్టవద్దు. అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు ఏర్పడకుండా ఉండేందుకు ఫైర్‌లైన్లు ఏర్పాటు చేశాం. వీటి ద్వారా అడవుల్లో ఉన్న వృక్ష సంపదకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మహిళా ఉద్యోగికి బహుమతిని అందజేస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, వాటితో సంబంధం లేకుండా క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్‌లో మహిళా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని చెప్పారు. అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి, డీడబ్ల్యూవో ధనమ్మ, టీజీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ రఫీ, కొప్పు ప్రసాద్, డాక్టర్ రాజశేఖర్, పి.రాజేంద్రప్రసాద్, సోమ్లానాయక్, నీలోఫర్‌అజ్మీ, డాక్టర్ ప్రియదర్శిని పాల్గొన్నారు.

'పది'లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి

- విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు ప్రీఫైనల్ పరీక్షలు తొలిమెట్టు అని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రీఫైనల్ పరీక్షలను వార్షిక పరీక్షలే అనుకొని చాలా జాగ్రత్తగా రాసి ఉత్తమ మార్కులు సాధించాలని తెలిపారు. విద్యార్థులు సమయపాలన పాటిస్తూ పరీక్ష పత్రాన్ని క్షుణ్ణంగా చదివి సమాధానాలు రాయాలని

మిగతా 8వ పేజీలో...

భారీగా ఎర్రబంగారం

- కేసముద్రం యార్డుకు 10వేల బస్తాల రాక
- పోలీసుల చొరవతో సమస్య పరిష్కారం
- నేటి నుంచి మూడు రోజుల పాటు మార్కెట్ బంద్

బారులు తీరిన మిర్చి వాహనాలు



కేసముద్రం మార్కెట్ గేటు ఎదుట బారులు తీరిన మిర్చి వాహనాలు

కేసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మిర్చి బస్తాల కాంటాలు పూర్తి కాకపోవడంతో నిర్వహణకు ఆటంకం ఏర్పడుతోంది. బుధవారం రాత్రి మిర్చి వేలం పాటల్లో సరుకు దక్కించుకున్న వ్యాపారులు కాంటాలు నిర్వహించకుండా నిలిపివేసిన విషయం విధితమే. ఈ క్రమంలో రాత్రి 7.30 గంటల ప్రాంతంలో పోలీసులు, మార్కెట్ అధికారుల చొరవతో కాంటాలు ప్రారంభించారు. అర్ధరాత్రి వరకే కాంటాలు నిర్వహించడం, కొన్ని కంపెనీలు కాంటాలు అసలే నిర్వహించకపోవడంతో యార్డులో సుమారు 4 వేల బస్తాల మిర్చి పేరుకుపోయింది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజాము నుంచే రైతులు మిర్చి విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. ఓ వైపు కవర్‌షెడ్లలో మిర్చి బస్తాలు ఉండడం, మరోవైపు కొన్ని కవర్‌షెడ్లు, ఓపెన్ యార్డులో పలువురు రైతులు మొక్కజొన్నలను ఆరబోసుకోవడంతో కొత్తగా వచ్చే సరుకుకు మార్కెట్లో స్థలం లేకుండా పోయింది. దీంతో తెల్లవారుజామున మార్కెట్ గేట్లు తెరవకపోవడంతో మిర్చి, మొక్కజొన్న వాహనాలు మార్కెట్‌రోడ్డులో భారీగా నిలిచిపోయాయి. ఉదయం 9 గంటల నుంచి మార్కెట్ మూడో గేటు నుంచి వాహనాలను లోపలికి పంపుతామని మార్కెట్ సిబ్బంది చెప్పడంతో ఆ గేటు నుంచి సుమారు అరకిలోమీటరు వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ కవర్‌షెడ్లలో ఆరబోసుకున్న మొక్కజొన్నలను దగ్గరకు చేయించి, బారులు తీరిన వాహనాలను యార్డులోకి పంపి కవర్‌షెడ్లలో మిర్చి బస్తాలను వేయించారు. మార్కెట్ కవర్‌షెడ్లు, ఓపెన్ యార్డులో మొక్కజొన్నలను ఆరబోసుకోవడంతో మిర్చికి స్థలం లేకుండా పోతోందని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. ఈ క్రమంలో మొక్కజొన్నలను ఆరబెట్టుకునేందుకు మార్కెట్‌కు తీసుకురావద్దని సూచిస్తూ మార్కెట్ గేటుకు ఫ్లెక్సీలను కట్టారు. యార్డులో పది వేల మిర్చి బస్తాలు పేరుకుపోయాయని, కాంటాలు, బండ్ల తోలకం ఆలస్యమవుతున్నందున శుక్రవారం రైతులు మిర్చిని మార్కెట్‌కు తీసుకురావద్దని చైర్మన్ గంట సంజీవరెడ్డి కోరారు. ఆ మరుసటి రోజు శని, ఆదివారాంతపు సెలవులు ఉన్నట్లు తెలిపారు.

మానుకోటకు 20 వేల బస్తాలకు పైగా రాక

నేడు మార్కెట్ బంద్

మహబూబాబాద్ అగ్రికల్చర్, (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 20 వేల బస్తాలకు పైగా మిర్చి రాబడులు కొనసాగినట్లు మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ తెలిపారు. మార్కెట్ యార్డులో సరిపడ స్థలం లేనందున, సరుకులతో మార్కెట్ మొత్తం నిండిపోయిందని, వేలం పాటలు అయి కాంటాలు పూర్తయ్యే వరకు రెండ్రోజుల వరకు సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు. శుక్రవారం మార్కెట్‌యార్డు బంద్ చేస్తున్నామని, రైతులు గమనించి మార్కెట్‌కు మిర్చి తీసుకురావోద్దని, శని, ఆదివారాలు వారాంతపు సెలవులు ఉన్నాయని, సరుకులు తీసుకువచ్చి రైతులు ఇబ్బందులకు గురికావోద్దని చెప్పారు. మార్కెట్ సోమవారం నుంచి యార్డులో క్రయవిక్రయాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

- 4,164 మంది హాజరు
- ఇద్దరు విద్యార్థులు వెనక్కి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. తెలుగు, సంస్కృతం, హిందీ సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలను విద్యార్థులు రాశారు. ఉదయం 9 నుంచి 12గంటల వరకు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 20పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేశారు. ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ (తెలుగు, హిందీ, సంస్కృతం) పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 4,298 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 4,164 మంది హాజరయ్యారు.



మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర కళాశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



మహబూబాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద దివ్యాంగ విద్యార్థులను ఎత్తుకుని పరీక్ష కేంద్రంలోకి తీసుకువెళ్తున్న సిబ్బంది

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 3,230కి గాను 3,149 మంది పరీక్ష రాశారు. వొకేషనల్ విభాగంలో 1,068కి గాను 1,015 మంది హాజరయ్యారు. పోలీస్‌స్టేషన్లలో ఉన్న పరీక్ష పత్రాలను ఉదయం 8 గంటలకు చీఫ్ సూపరిండెట్లు, పోలీసుల పర్యవేక్షణలో పరీక్ష కేంద్రాలకు చేరవేశారు. పరీక్ష పత్రాలను సీసీ కెమెరాల నిఘా, చీఫ్‌సూపరిండెంట్ల పర్యవేక్షణలో విడుదల చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆయా సెంటర్లలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలను, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఆందోళనలు జరుగకుండా ప్రతి సెంటర్ వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లను నియమించి ఎస్సైల పర్యవేక్షణలో 168 బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్‌ను అమలు చేశారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్‌గౌడ్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నలంద, వికాస్, ఎస్వీ, మోడల్ స్కూల్ కళాశాల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు సందర్శించాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరిగిన పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్, డిబార్‌లు కానీ జరగలేదని డీఐఈవో తెలిపారు. కాగా, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద ఇద్దరు దివ్యాంగ విద్యార్థులను సిబ్బంది ఎత్తుకుని పరీక్ష కేంద్రంలోనికి తీసుకువెళ్లారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలురలో-1 బాలికల జూనియర్ కళాశాల వద్ద-1 మొత్తం ఇద్దరు విద్యార్థులు వద్దకు 5 నిమిషాలు ఆలస్యంగా రావడంతో ఇద్దరిని అధికారులు వెనక్కి పంపించారు.

మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్

వెంకటాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని మిర్చి కల్లాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలకేంద్రంలో జరిగిన జిల్లా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ఎకరం మిర్చి పంటను సాగు చేసేందుకు లక్షల రూపాయల పెట్టుబడి పెట్టారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కింటాల్‌కు రూ.25 వేలతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకటరెడ్డి, మచ్చా వెంకటేశ్వర్లు, గ్యానం వాసు, చిట్టెం ఆదినారాయణ, కుమ్మరి శ్రీను, తోట నాగేశ్వర్‌రావు, కట్ల నర్సింహచారి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల గెలుపుతో బీజేపీ సంబరాలు



సంబరాలు జరుపుకొంటున్న బీజేపీ నాయకులు

తొర్రూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండింటిలో బీజేపీ ఎమ్మెల్సీల ఘన విజయాన్ని హర్షిస్తూ గురువారం తొర్రూరు రూరల్, అర్బన్ కమిటీల ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ కన్వీనర్ పూసల శ్రీమాన్, జిల్లా కార్యదర్శి కొలుపుల శంకర్ మాట్లాడుతూ మూడు స్థానాల్లో రెండింటిలో బీజేపీ విజయం సాధించడం అభినందనీయమని అన్నారు. తెలంగాణలో ఇదే పరంపర కొనసాగుతుందని, రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైండ్ల రాజేష్, రచ్చ కుమార్, రాంబాబు, రవిబాబు, యాకయ్య, శేఖర్, విజయ్‌కుమార్, నవీన్, సంతోష్ శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

16న జనగామ జిల్లాకు సీఎం రాక

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఈనెల 16న సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 16న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో వంద పడకల ఆస్పత్రి, రెసిడెన్షియల్ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బంజారా భవన్, సమీకృత రెవెన్యూ డివిజన్ కార్యాలయ సముదాయం, విద్యుత్ సబ్‌స్టేషన్, గ్రామ పంచాయతీల్లో ఎంపిక చేసిన ఇందరమ్మ ఇండ్లు, ఇతర అబివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరుగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేస్తూ సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు గోపిరాం, వెంకన్న, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, డీఆర్డీవో వసంత, డీఎంహెచ్‌వో మల్లికార్జున రావు, డీపీవో స్వరూప, హౌసింగ్ పీడీ మాత్రునాయక్, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

అలుపెరుగని యాత్రికుడు

- పశ్చిమ బెంగాల్ నుంచి యువకుడి సైకిల్ యాత్ర
- రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు..

వాజేడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ ఓ యువకుడు సైకిల్ యాత్ర చేపట్టాడు. పశ్చిమ బెంగాల్ నుంచి బయల్దేరి దేశమంతటా పర్యటిస్తున్నాడు. పొరుగు దేశాలైన నేపాల్, భూటాన్‌కూ అదే సైకిల్‌పై వెళ్లొచ్చాడు. అనేక మైలు రాళ్ల దాటుతూ ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లికి చేరుకున్నాడు.



చీకుపల్లికి చేరుకున్న బిప్లక్‌సింగ్

పశ్చిమ బెంగాల్‌లోని బంకురా జిల్లాకు చెందిన బిప్లక్ సింగ్ సైకిల్ యాత్ర చేపట్టాడు. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపొద్దని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేశ వ్యాప్తంగా పర్యటిస్తున్నాడు. ఏడాదిన్నర కాలంగా అన్ని రాష్ట్రాలను తిరుగుతూ వాజేడుకు చేరుకున్నాడు. ఇప్పటి వరకు 27వేల కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కుతూ పర్యటించానని తెలిపాడు. మహాకుంభమేళా జరిగిన ప్రయాగ్‌రాజ్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దాటుకొని తెలంగాణ మీదుగా ఒడిశా వెళ్తున్నానని తెలిపాడు.

విశ్రాంతి గదిలో మద్యం తాగిన కానిస్టేబుళ్లు!

- సామాజిక మాధ్యమాల్లో వైరల్

పెద్దవంగర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పోలీసు స్టేషన్‌లోని విశ్రాంతి రూములో కానిస్టేబుళ్ల మద్యం తాగిన ఫొటోలు గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లోని విశ్రాంతి రూములో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ కలిసి మద్యం సేవించారు. ఈ ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్థానిక ఎస్సై క్రాంతికిరణ్ వివరణకోరగా బుధవారం రాత్రి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ విధులు ముగించుకొని రాత్రి భోజనం చేయడానికి విశ్రాంతి రూము వెళ్లారని, వారు విధుల్లో లేరని ఎస్సై తెలిపారు.



విశ్రాంతి గదిలో మద్యం తాగుతున్న కానిస్టేబుళ్లు

ఎస్సారెస్పీ కెనాల్‌కు గండ్లు పెడితే క్రిమినల్ కేసులు

దంతాలపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ కెనాల్‌కు గండ్లు పెడితే క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని డీఈ వినయ్ హెచ్చరించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్ శివారు వద్ద డీబీఎం 60 కెనాల్ ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీబీఎం 60నుంచి వెళ్లే ఉప కెనాల్‌కు గండ్లుకాని మట్టి తొలకడం జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులకు యాసంగిలో నీటిని అందించేందుకు మార్చి 30 వరకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తామన్నారు. కెనాల్ గేట్లను ఎత్తివేయకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మరిపెడ మండలంతో పాటు చివరి ఆయ కట్టు వరకు నీటిని విడుదల చేస్తామన్నారు.

రైలులో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



కేసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య డౌన్‌లైనులో 418/26-28 కిలోమీటరు వద్ద గురువారం తెల్లవారుజామున వేగంగా వెళుతున్న రైలులో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు వరంగల్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు తెలిపారు. రైలులో నుంచి పడడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శరీరంపై నలుపు రంగు లోయర్ ప్యాంట్, పసుపు రంగు టీషర్టు ఉన్నాయని, ఛాతిపై 'వీటీ' అని పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు 9441557232 సెల్ నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళా హక్కుల కోసం ఉద్యమిద్దాం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి

మహబూబాబాద్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోరాట స్ఫూర్తితో శ్రామిక మహిళా హక్కుల కోసం ఉద్యమిద్దామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రామిక మహిళా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమపై జరుగుతున్న దోపిడి, పీడనలకు వ్యతిరేకంగా పని గంటల తగ్గింపు, ఓటు హక్కు కోసం శ్రామిక మహిళా లోకం సుదీర్ఘపోరాటాల ఫలితంగా 115 సంవత్సరాల క్రితం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందని చెప్పారు. సమాజంలో తరతరాల నుంచి ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయిలో వెళ్లూనుకుని ఉండడం మూలంగా మహిళలు అవమానాలు, హింస, దాడులకు గురవుతున్నారని చెప్పారు. మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, కుమ్మరికుంట్ల నాగన్న, దారా స్నేహబింధు, బెస్త సంపూర్ణ, లలిత, సంధ్య, సలీమా, జ్యోతి, శ్రావణి, ఉమ, వీరలక్ష్మి, అనురాధ, కాంతి, మంజుల పాల్గొన్నారు.



శ్రామిక మహిళా జిల్లా సదస్సులో మాట్లాడుతున్న కాసు మాధవి

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కాటారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గుండ్రాత్‌పల్లి జీపీ పరిధి మల్లారంలో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామస్థులు, పలువురు దాతల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం గురువారం జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, సన్నాయి వాయిద్యాల చప్పుళ్లు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య యంత్ర, విగ్రహ ప్రాణ పతిష్ఠ కనులపండువుగా సాగింది. పూర్ణాహుతితో ఉత్సవాలు ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఉత్సవాల్లో పాల్గొని ఆంజనేయ స్వామిని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గోనె కపిల్, గోనె మనోహర్, తిరుపతి, బాపు, మధునయ్య, సమ్మయ్య, నాగరాజు, రాజేందర్, మహేందర్, శ్రీకాంత్, ప్రశాంత్, పోచయ్య, అనిల్, రాజు, కరుణాకర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు, నిర్వాహకులు

మాజీ సర్పంచ్‌పై ఠాణాలో ఫిర్యాదు

దంతాలపల్లి(మహబూబాబాద్ జిల్లా), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీరిశెట్టిగూడెంకు చెందిన మాజీ సర్పంచ్ నెహ్రూపై గురువారం పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను తనపేరుపై నుంచి జీపీకి మార్చుకోవాలంటూ నెహ్రూ ట్రాక్టర్‌ను ఇంటికి తీసుకెళ్లడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై నెహ్రూను వివరణ కోరడంతో బీరిశెట్టిగూడెం జీపీకి చెందిన ట్రాక్టర్‌ను తన పేరిట గత ప్రభుత్వ హయాంలో బ్యాంకు లోన్ తీసుకున్నారన్నారు. ఇటు గ్రామపంచాయతీ అధికారులు 14 నెలల నుంచి బ్యాంకుకు లోన్ కట్టకపోవడంతో అధికారులు ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

మహిళా సాధికారతే కాంగ్రెస్ ధ్యేయం

- పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ

గోవిందరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళల సాధికారతే కాంగ్రెస్ ధ్యేయమని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంగోత్ సుగుణ అన్నారు. మండల కేంద్రంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కల్యాణి ఆధ్వర్యంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశం జరగ్గా ముఖ్య అతిథిగా సుగుణ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళల అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పాటుపడుతున్నారన్నారు. ప్రతి మహిళనూ కోటీశ్వరులను చేసేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చి మహిళలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాల్లో నూతన ఒరవడిని సృష్టిస్తూ ఆర్టీసీ బస్సుల నిర్వహణ కూడా అప్పగించనున్నారని అన్నారు. ఇందిరా మహిళాశక్తి ద్వారా ఇప్పటికే క్యాంటీన్లు పెట్టుకోవడానికి ఆర్థిక సాయం అందించి ప్రారంభించినట్టు తెలిపారు. ప్రతి రైల్వేస్టేషన్‌లో మహిళా సంఘాలకు టీస్టాల్స్ ఏర్పాటు చేయడంతోపాటు వాటి నిర్వహణ బాధ్యత కూడా మహిళాసంఘాలకు ఇస్తున్నారని అన్నారు. ప్రతి మహిళ మండలంలో వెయ్యి సభ్యులకు తగ్గకుండా మహిళా మెంబర్‌షిప్ చేయాలని, పని చేస్తేనే పదవులు దరిచేరుతాయని అన్నారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు జ్యోతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, కర్ల అరుణ, పేడిక లక్ష్మి, గుండెబోయిన నాగలక్ష్మి, వసంత పాల్గొన్నారు.



కాంగ్రెస్ మహిళా కార్యకర్తలతో సుగుణ

వైభవంగా వీరభద్రుడి పవళింపు సేవ

కురవి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీభద్రకాళి సమేత వీరభద్రుడి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 10వ రోజు గురువారం రాత్రి స్వామివారి పవళింపు సేవా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భద్రకాళి, వీరభద్రుడికి వస్త్రాల సమర్పణ, బ్రహ్మముడి, ఫలదానం, వంటి పదహారు విధాల పూజా కార్యక్రమాలతో స్వామివారి పవళింపు సేవ కొనసాగింది. ఈ పూజాకార్యక్రమాన్ని ఆలయ అర్చకులు బాలకృష్ణ, శ్రీకాంత్, విజయ్, పుణ్యమూర్తిల పర్యవేక్షణలో నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా, ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం ప్రతీ ఒక్కరికి పసుపు, కుంకుమలు, జాకెట్ ముక్కలు బహుమానంగా అందించారు. ఈ కార్యక్రమంలో మానుకోట డీఎస్పీ తిరుపతిరావు దంపతులు, రూరల్ సీఐ సర్వయ్య దంపతులు, ఈవో సత్యనారాయణ, రవి పాల్గొన్నారు.





వీరభద్రుడికి పవళింపు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

- 10 కిలోల సరుకు స్వాధీనం
- మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య

మహబూబాబాద్ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 10.102 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ సర్వయ్య గురువారం తెలిపారు. సీఐ తెలిపిన ప్రకారం... ఒడిస్సా రాష్ట్రం గంజాం జిల్లా బానే మండలం బడఖరిడ గ్రామానికి చెందిన బరున బరడ్ వ్యక్తి సూరత్‌లో ఉంటూ కూలీ..నాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వచ్చిన డబ్బులు సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఒడిస్సా రాష్ట్రంలో గోపాల్ అనే వ్యక్తి వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి దానిని విక్రయించేందుకు విజయవాడ వెళ్తుండగా మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో పోలీసులు తనిఖీ చేస్తుండగా రైలు దిగి తొర్రూరు మీదుగా వరంగల్ వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. శనిగపురం శివారు బాలాజీ గార్డెన్ క్రాస్‌రోడ్డు వద్ద మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికారెడ్డి సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటో దిగి పారిపోయే ప్రయత్నం చేశాడు. అనుమానం వచ్చి అతన్ని పట్టుకుని తనిఖీ చేయగా బ్యాగులో 10.102 కిలోల ఎండు గంజాయి లభ్యమైనట్లు చెప్పారు. సుమారు దాని విలువ రూ.5,05,100 ఉంటుందని పేర్కొన్నారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించిన సీఐ సర్వయ్య, ఎస్సై దీపికారెడ్డి, ఏఎస్సై జాకీర్, సిబ్బంది అశోక్, రవి, ఉమ, బాలరాజు, లింగారావు, సంతోష్‌కుమార్, కిషన్‌ను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య

సిద్ధమైన వసతి గృహం

- దేశాయిపేటలో పూర్తయిన మహిళా ఉద్యోగుల వసతి గృహం
- రూ.4 కోట్లతో నిర్మాణం
- వంద మంది మహిళలతో పాటు పది మంది పిల్లలకు వసతి

పోచమ్మమైదాన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహిళా ఉద్యోగులకు ఆశ్రయం కల్పించేందుకు నిర్మించిన వసతి గృహం కం డే కేర్ సెంటర్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతప్రభుత్వంలో తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ, దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రం ఆధ్వర్యంలో దేశాయిపేటలో దీని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం సర్వే నెంబరు 61లో 15 గుంటల స్థలాన్ని కేటాయించారు. 2023 జూన్‌లో రూ.4కోట్ల వ్యయంతో నిర్మాణాన్ని చేపట్టారు. కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం వాటా 40 శాతం నిధులతో దీన్ని నిర్మించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వర్కింగ్ ఉమెన్స్‌తో పాటు ఉన్నత చదువులు, ఉపాధి-శిక్షణ కోసం వచ్చే మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా నామమాత్రపు రుసుంతో వసతి, భోజనం కల్పిస్తారు.

పిల్లలకు సైతం

మొత్తం 47 గదులతో వంద మంది మహిళలు, పది మంది పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్మాణం చేపట్టారు. భవనం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. వసతిగృహంలో ఉండే మహిళలకు ఎలాంటిఇబ్బందులు తలెత్తకుండా సెక్యూరిటీతోపాటు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి, శిక్షణ కోసం వచ్చే మహిళలకు ఆశ్రయం కల్పించడమే లక్ష్యంగా వసతిగృహాన్ని రూపొందించారు.



మహిళా ఉద్యోగుల వసతి గృహం

రేపు ప్రారంభించనున్న మంత్రి సురేఖ!

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మహిళా దినోత్సవం నాడు ప్రారంభించి, మహిళలకు వసతి గృహం సేవలు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో పనులు వేగంగా పూర్తి చేశారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2317	2100
పల్లికాయ (సూక)	6950	6500
పల్లికాయ (పచ్చిది)	4600	4400
కందులు	7010	5540
పెసళ్లు	7159	4645
పత్తి	6900	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14150	9000
డిడి	13000	12500
వండర్‌హాట్	16900	11500
ఎల్లో మిర్చి	17000	15000
యూఎస్341	14000	9500
దేశీ	30000	25500
సింగిల్‌పట్టి	40000	39000
దీపిక	17300	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

యక్షగాన కిరీటి గజవెల్లి

- బాల్యం నుంచే ప్రదర్శనలిస్తున్న సారయ్య
- విభిన్న పాత్రల్లో రాణింపు



'లవకుశ'లో శ్రీరాముడిగా సారయ్య



విరాట పర్వంలో దుర్యోధనుడి పాత్రలో గజవెల్లి సారయ్య

వడ్డెపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పల్లెవాసుల కట్టుబాట్లు.. తెలంగాణ సంస్కృతి సౌరభాలు.. పురాతన ఆచారాలపై అబ్బురపరిచే ప్రదర్శనలిస్తూ యక్షగాన కిరీటిగా వెలుగొందుతున్నారు గజవెల్లి సారయ్య. పాలబుగ్గల ప్రాయం నుంచే పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తూ జిల్లా కీర్తిని రాష్ట్ర నలుదిశల చాటుతున్నారు. నటనలో రారాజుగా తన హావభావలతో అబ్బురపర్చే ప్రదర్శనలతో ఔరా అనిపిస్తున్నారు. హసన్‌పర్తి మండలం పెగడపెల్లి గ్రామానికి చెందిన గజవెల్లి సారయ్య కళారంగంలో అందరికి సుపరిచితుడే. ఐదేళ్ల వయసు నుంచే తండ్రి సమ్మయ్య వెంట గ్రామ గ్రామాన తిరుగుతూ ముఖానికి రంగు పులుముకొని ప్రదర్శనలు ఇచ్చేవారు. ప్రదర్శనల సందర్భంగా ప్రతిఫలంగా గ్రామస్థుల నుంచి నగదు, ధాన్యం, వస్త్రాలు పొందేవారు. లోహితాషుడు, భక్త సిరియాల్, భక్త ప్రహ్లాదుడు, భక్త మార్కండేయ, బాలబద్దిరాజు తదితర పౌరాణిక నాటకాల్లో బాల పాత్రలు వేయడంలో ఆయనకు ఆయనే సాటి. 16 ఏళ్ల వయసు నుంచే శ్రీకృష్ణుడు, భబ్రువాహనుడు, అర్జునుడు, పుండరీకుడు, కీచకుడు, రావణ బ్రహ్మ, మహిరావణుడు, మాయల పకీర్, మాందాత రాజు, సత్య హరిశ్చంద్ర, హిరణ్యకశ్యకుడు,యమధర్మరాజు లాంటి విభిన్న పాత్రలను పోషిస్తూ ప్రజాదరణ పొందారు. బాల్యంలో నేర్చుకున్న నాటకాలకు మరింత పదును పెట్టిన సారయ్య ఇంతింతై వటుడింతై అన్న చందంగా కళారంగంలో రాణిస్తూ అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి అవార్డులు, రివార్డులు, ప్రశంసలను పొందుతున్నారు. ప్రస్తుతం గజవెల్లి సారయ్య తెలంగాణ రాష్ట్ర చిందు వృత్తి కళాకారుల సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తూ కళాకారుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర పోరులో ఎన్నో చిందు యక్షగాన ప్రదర్శనలు ఇచ్చి ఉద్యమానికి ఊపిరిలూదారు సారయ్య.



అవార్డులతో గజవెల్లి సారయ్య

సారయ్య కళా ప్రదర్శనలో మైలురాళ్లు..

1989 సంవత్సరంలో జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సారా నిషేధం, రూ. 2కే కిలో బియ్యం, ఉచిత కరెంటు, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై ప్రజలను చైతన్యం చేస్తూ రాష్ట్రంలోని 3 వేల గ్రామాల్లో ప్రదర్శనలిచ్చారు. 1991 నుంచి వరంగల్ ఆకాశవాణి ద్వారా 1500కార్యక్రమాలు హైదరాబాద్ కేంద్రం ద్వారా శ్రోతలకు 300 పౌరాణిక చిందు యక్షగాన ప్రదర్శన నాటకాలను వినిపించారు. 1999లో మద్రాసులో దక్షిణ చిత్రలో పది రోజుల పాటు ప్రదర్శనలు ఇచ్చి అక్కడి అధికారుల ప్రశంసలు అందుకున్నారు. 2010లో తిరుపతిలోని శిల్పారామంలో ప్రదర్శన ఇచ్చారు. 2010లో హైదరాబాద్‌కు చెందిన స్పృహ సాహితీ సంస్థ సారయ్య ప్రదర్శనను గుర్తించి ప్రముఖ కవి జూలూరు గౌరీశంకర్, సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వర్లు, చుక్క రామయ్య, ఆచార్య జయధీర్ తిరుమల్‌రావు, సినీ దర్శకుడు బి.నర్సింగరావు, గేయ కవులు అందెశ్రీ, గోరటి వెంకన్న సమక్షంలో ఘనంగా సన్మానించి రూ.10వేల నగదు బహుమతిని అందజేశారు.

యక్షగాన కళాకారులకు ఫించన్ మంజూరు చేయాలి



చిందు కళాకారులకు నెలకు రూ.10వేల చొప్పున పింఛను మంజూరు చేయాలి. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డు, నివేశన స్థలాలు ఇవ్వాలి. ఆర్టీసీ బస్సులు, రైళ్లల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలి. చిందు కళాకారులు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించాలి. చిందు యక్షగాన కళాకారులకు గుర్తింపు కార్డులు, గద్దర్, కేంద్ర అవార్డులు ప్రదానం చేయాలి. చిందు కళాకారులకు హైదరాబాద్‌లో ఎకరం స్థలం కేటాయించి చిందు భవనాన్ని ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలి.

- గజవెల్లి సారయ్య, చిందు యక్షగాన వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

గడ్డి గింజల ఉత్పత్తిలో నెంబర్ వన్



- దేశంలోనే మొదటి స్థానంలో ముల్కనూర్ మహిళా డెయిరీ
- రూ.20కోట్లు కేటాయింపు.. క్వింటా గింజలకు గాను రైతుకు రూ.7500 చెల్లింపు
- ఈ సీజన్లో 6వేల క్వింటాళ్లు ఇతర రాష్ట్రాలకు తరలింపు
- ప్రణాళిక రూపొందించిన జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ

ఓ రైతు సాగు చేసిన జవారి గడ్డి గింజల చేను





ఇతర ప్రాంతాల నుంచి బస్తాల్లో వచ్చిన జవారి గడ్డి గింజలను దిగుమతి చేస్తున్న కార్మికులు

భీమదేవరపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మేలు జాతి పశువులకు మేలైన గడ్డి జాతి గింజలను తయారు చేసేందుకు జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) ప్రత్యేక ప్రణాళికలు చేపడుతోంది. గతంలో పాడి పశువులు 7-8 లీటర్ల పాలు ఇస్తేనే గగనం. అలాంటిది నేటి రోజుల్లో 15-20 లీటర్లు ఇచ్చే సంకర జాతి పశువులు అందుబాటులోకి వచ్చాయి. అలా ఎక్కువ మోతాదులో పాలు ఇచ్చే పాడి పశువులకు మామూలు పచ్చి మేత వేస్తే సత్ఫలితాలు రావని ఎన్‌డీడీబీ భావించింది. ఇందుకోసం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 60వేల క్వింటాళ్ల మేలైన గడ్డి గింజలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం సహకార సంఘాల ఆధ్వర్యంలో నడిచే సంస్థల్లో మేలైన గడ్డి గింజలను తయారు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో పాడి పశువులకు పశువుల మేత అందుబాటులో ఉంచాలని ఈ పథకానికి ఎన్‌డీడీబీ శ్రీకారం చుట్టింది. పశువుల మేతలో అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలు, అధిక పోషకాలిచ్చే గడ్డి జాతి గింజలను విత్తనోత్పత్తి చేసి పాడి రైతులకు రాయితీపై అందించాలని లక్ష్యం నిర్దేశించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని డెయిరీలకు మేలైన గడ్డి గింజలను ఉత్పత్తి చేసేందుకు విత్తనాలను సరఫరా చేసింది. అందులో భాగంగా ముల్కనూర్ మహిళా డెయిరీలో గడ్డి గింజల తయారీని చేపట్టాలని ఆదేశించింది. ప్రస్తుతం ముల్కనూర్ మహిళా డెయిరీ పరిధిలో గడ్డి గింజల ఉత్పత్తి పథకం ముమ్మరంగా సాగుతోంది .



గడ్డి గింజలను ప్యాక్ చేస్తున్న కార్మికులు

20వేల క్వింటాళ్ల గడ్డి గింజల ఉత్పత్తి

ముల్కనూర్ మహిళా డెయిరీ పరిధిలో 20వేల క్వింటాళ్ల గడ్డి గింజల ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టింది. డెయిరీ పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతులచే పచ్చ జొన్న (జవారి జొన్న), మొక్కజొన్న విత్తనాలను తయారు చేయాలని విత్తనాలను పంపించారు. డెయిరీ పరిధిలో రైతులు పండించిన జవారి గడ్డి విత్తనాలకు క్వింటాల్‌కు రూ. 7500 చెల్లించాలని ధర నిర్ణయించారు. దీంతో డెయిరీ పరిధిలోని పలువురు రైతులు జవారి జొన్న గడ్డి విత్తనాలను తయారు చేసేందుకు ముందుకు వచ్చారు.

ఉత్పత్తికి రూ.20 కోట్లు విడుదల

ముల్కనూర్ మహిళా డెయిరీలో 20వేల క్వింటాళ్ల జవారి, మొక్కజొన్న గడ్డి విత్తనాలను తయారు చేసేందుకు రూ. 20కోట్ల నిధులను మహిళా డెయిరీకి ఎన్‌డీడీబీ విడుదల చేసింది. ఈ నిధులతో గడ్డి విత్తనాలను తయారు చేసేందుకు డెయిరీ పరిధిలోని అధికారులు తీవ్రంగా రైతులతో శ్రమిస్తున్నారు. 20వేల క్వింటాళ్ల గడ్డి గింజల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోగా 6వేల క్వింటాళ్ల గడ్డి విత్తనాలను దేశంలోని వివిధ ప్రాంతాల్లోని రాష్ట్రాలకు తరలించారు.

రాజస్థాన్, పంజాబ్, యూపీ, బీహార్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, తదితర రాష్ట్రాలకు గడ్డి విత్తనాలను పంపించారు. రత్నగిరి గ్రామంలోని ముల్కనూర్ సహకార బ్యాంక్ సీడ్ ప్లాంట్ ద్వారా తయారైన జవారి విత్తనాలను ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు పంపిస్తున్నారు. 3కిలోలు, 6కిలోల బ్యాగులలో ప్యాకింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రైతులు పండించిన జవారి విత్తనాలకు నేరుగా క్వింటాల్‌కు రూ. 7500 చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. దీంతో నిధుల అవకతవకలకు పాల్పడకుండా ఉంటుందని ఎన్‌డీడీబీ ఈ చర్యలు చేపట్టింది.



20వేల క్వింటాళ్ల గడ్డి గింజల ఉత్పత్తే లక్ష్యం..

ముల్కనూర్ మహిళా డెయిరీలో 20వేల క్వింటాళ్ల జవారి గడ్డి గింజలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 6వేల క్వింటాళ్ల గడ్డి గింజలను దేశంలోని వివిధ రాష్ట్రాలకు తరలించాం. మరో నెల రోజుల్లో మిగతా 14వేల క్వింటాళ్ల గడ్డి గింజలను దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తాం. ఎన్‌డీడీబీ గడ్డి గింజల ఉత్పత్తి కోసం ముల్కనూర్ మహిళా డెయిరీకి రూ. 20కోట్ల నిధులను విడుదల చేసింది. 60వేల క్వింటాళ్ల గడ్డి గింజల దిగుబడి దేశంలో లక్ష్యంగా కాగా ఒక్క ముల్కనూర్ మహిళా డెయిరీ 20వేల క్వింటాళ్ల గడ్డి గింజలను తయారు చేసి దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తుంది.

- మార్పాటి భాస్కర్‌రెడ్డి, జనరల్ మేనేజర్, ముల్కనూర్ మహిళా డెయిరీ



జవారి విత్తనాలు పండిస్తే ఎంతో లాభం

యాసంగిలో జవారి గడ్డి విత్తనాలు పండిస్తే ఎంతో లాభంగా ఉంది. యాసంగిలో నీటి ఎద్దడి ఉండడంతో నేను ముల్కనూర్ మహిళా డెయిరీ ద్వారా జవారి విత్తనాలను తీసుకొని రెండెకరాల్లో సాగు చేశాను. నా పంట ఎండి పోకుండా పండింది. క్వింటాల్‌కు రూ. 7500 ధరగా నిర్ణయించడంతో రైతులకు ఎంతో లాభం ఉంటుంది. ఎకరంలో 10-12క్వింటాళ్ల జవారి విత్తనాలు పండే అవకాశం ఉంది.

- సంగెం సదానందం, రైతు, కొప్పురు

ఖండాలు దాటిన ప్రేమ

- పెళ్లాడిన దక్షిణ అమెరికా అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి
- కేసముద్రంలో ఘనంగా వివాహ వేడుక



కేసముద్రంలో కొలంబియా అమ్మాయి రియా, కేసముద్రం అబ్బాయి సాయిచైతన్య వివాహం

కేసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఖండాలు దాటిన వారి ప్రేమ.. పెళ్లితో నూరేళ్ల బంధానికి అడుగులు వేసింది. ఉన్నత చదువులు కోసం ఆస్ట్రేలియా వెళ్లి.. అక్కడే ఉద్యోగం చేస్తున్న క్రమంలో దక్షిణ అమెరికా ఖండం కొలంబియా దేశానికి చెందిన అమ్మాయితో తెలంగాణ అబ్బాయికి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. చివరకు వారు అబ్బాయి స్వస్థలమైన తెలంగాణలో వివాహం చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రానికి చెందిన వేల్పుల రాజేష్‌యాదవ్- ప్రసన్నలత దంపతుల పెద్దకుమారుడు సాయిచైతన్య ఉన్నత చదువుల నిమిత్తం ఎనిమిదేళ్ల క్రితం ఆస్ట్రేలియాకు వెళ్లాడు. చదువు పూర్తయ్యాక అక్కడే ఒక ప్రముఖ కంపెనీలో ఈవెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇక దక్షిణ అమెరికా ఖండంలోని కొలంబియా దేశం బొగోటా పట్టణానికి చెందిన యుక్లేడిస్ ఖింతేరో-పోల్గా మరియ దంపతుల కుమార్తె రియా కూడా ఆస్ట్రేలియాలో సాయిచైతన్య పనిచేసే కంపెనీలోనే అకౌంటెంట్‌గా చేరింది. నాలుగేళ్ల క్రితం ఇద్దరికీ పరిచయం ఏర్పడగా అది ప్రేమగా మారింది. దీంతో ఆ ఇద్దరు తమ పెద్దలను ఒప్పించి గురువారం కేసముద్రం అమినాపురంలో హిందూ సంప్రదాయంలో వివాహం చేసుకున్నారు. నాలుగు రోజులుగా హల్దీ, మెహందీ, సంగీత్ కార్యక్రమాలను నిర్వహించగా.. వధువు తరపున కొలంబియా నుంచి ఆమె అన్న సరియో, వదిన జులియానా హాజరయ్యారు. ఈ సందర్భంగా సరియో, జులియానాలు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించిన వివాహ వేడుకల్లో తాము పాల్గొన్నామని, ఈ సంస్కృతి, సంప్రదాయాలు తమకు చాలా నచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. తమ దేశంలో గంటలోనే వివాహం జరిపించి, 50 నుంచి వంద మంది హాజరవుతారని, వందల సంఖ్యలో పెళ్లికి రావడం బంధాలకు ఇక్కడ అధిక ప్రాధాన్యతనిస్తారని తమకు అర్థమవుతోందని అన్నారు.

ఉన్నది రెండు నెలలు.. మొదలు కాని పనులు

- సరస్వతీ పుష్కరాలకు సమీపిస్తున్న సమయం
- భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లలో తీవ్ర నిర్లక్ష్యం
- రూ.25కోట్లు విడుదలై టెండర్లు పూర్తయినా ఫలితం శూన్యం



కాళేశ్వర ఆలయం

మహదేవపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పుష్కర స్నానం చేస్తే సకల పాపాలు పోతాయని పెద్దలు చెప్పిన మాట.. ఈ క్రమంలో పుష్కర స్నానాల కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఇక తెలంగాణలోనే ప్రాచీన పుణ్య క్షేత్రంగా.. ఒకే పానవట్టంపై రెండు లింగాలు, గోదావరి ప్రాణహిత అంతర్వాయిహినిగా సరస్వతిగా మూడు నదులు, మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉండి త్రిలింగాలలో ఒకటిగా విలసిల్లుతున్న కాళేశ్వరానికి భక్తులు లక్షలాదిగా తరలొస్తారు. భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి క్షేత్రం వద్ద మే 15 నుంచి సరస్వతి పుష్కరాలు జరగనుండగా.. 12ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలోనే భక్తులకు ఎలంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.25కోట్ల నిధులు మంజూరు చేయించారు. పనులకు టెండర్లు పూర్తయ్యాయి. మరో రెండు నెలల్లో సరస్వతి పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. కానీ నేటికీ ఏ ఒక్క పని కూడా ప్రారంభం కాలేదు. గతంలో కూడా రూ.25 కోట్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేస్తే పదేళ్లు దాటినా ఇంకా పనులు పూర్తి కాక ఎక్కడివక్కడే మిగిలిపోయాయి. గతంలో జరిగిన సరస్వతి పుష్కరాలకు 12రోజుల్లో 50వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తే ఈ 2025లో జరిగే మహాసరస్వతి పుష్కరాలకు 5లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి. రూ.కోట్లు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తయితాయా లేదా అనేది ప్రశ్నార్థకమే. ఈ సరస్వతి పుష్కరంలోనే ఇండియాలోనే గంగా యమున, సరస్వతి పుష్కరాలకంటే తెలగాణలో జరిగే అతి ప్రాచీనమైన, పవిత్రమైన గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల్లో స్నానాలు చేస్తే ఎంత భాగ్యం కలుగుతుందని, అంత దూరం పోకుండా తెలంగాణలో జరిగే పుష్కరాల్లో స్నానం చేస్తే మరింత పుణ్యం వస్తుందని పురోహితులు తెలిపారు. మేలో జరిగే పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు ఒక్క పని కూడా కాకపోవడం గమనార్హం. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో 8, 18 లక్షలకు గాను 26 పనులకు నిధులు మంజూరవగా పంచాయతీ రాజ్‌కు రూ.3కోట్లు మంజూరయ్యాయి.

ఇరిగేషన్‌కు 5కోట్లు మంజూరయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్, మరుగుదొడ్ల కోసం రూ.2.23కోట్లు మంజూరయ్యాయి. దీంతో పాటు అన్ని పనులకు సీసీ రోడ్లు, ఇతర పనులకు రూ.26కోట్లకు పనులు మంజూరు చేసి టెండర్లు పూర్తి చేసింది. మండుటెండలు ఎక్కువగా ఉండడంతో మేలో జరిగే పుష్కరాలకు తొందరలోనే పనులు పూర్తి చేయాలని పలువురు భక్తులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఔషధఫలం రేగు..




చిన్న రేగు చెట్టు



ఔషధగుణాల సమాహారం..

రేగు పండ్లు రుచికి మాత్రమే కాదు.. ఆరోగ్యానికి అద్భుతంగా ఉపకరించే ప్రకృతి వరఫలం కూడా. ఇందులో అనేక ఔషధగుణాలున్నాయి. రేగు పండ్లతో తయారు చేసిన మందులు, జీర్ణ శక్తి, ఆకలి పెరగడం, రక్తహీనత నివారణ, విసుగు, నీరసం, శ్వాసనాళాల వాపును తగ్గించేందుకు కీలకంగా ఉపయోగపడుతాయి. గొంతు నొప్పి, హిస్టీరియా, అజీర్తి, కడుపులోమంట సమస్యలను తగ్గించేందుకు అద్భుతంగా పనిచేస్తాయి. పండ్లు మాత్రమే కాకుండా రేగు చెట్టు ఆకులను నూరి కట్టిపెడితే పుండ్లగాయాలు మానిపోతాయి. రేగు చెట్టు బెరడుతో తయారుచేసిన ఔషధాలు జ్వరం, తలనొప్పి, అతిసార, విరేచనాలను అరికడుతాయి. రేగుపండ్లలో సీ విటమిన్‌తో పాటుగా ఏ, బి1, బి2, బి3 విటమిన్లు లభిస్తాయి. వీటిలో చక్కెర, పిండిపదార్థాలు ఉంటాయి. రేగు పండ్లు రోగనిరోధక శక్తిని పెంపొందించడమే కాకుండా చెడుకొవ్వును కూడా కరగదీస్తాయని, మనసు బాగలేనప్పుడు రేగుపండ్లను తింటే మనసుకు స్వస్థత చేకూరుతుందని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారు.



రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం

లింగాలఘణపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే అనేక పండ్లలో రేగు పండ్లకు ప్రత్యేక స్థానముంది. ఉండేది చిన్న సైజు అయినా మనిషికి పెద్ద ప్రయోజనమే ఒకగూరుస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ రేగు పండ్లలో అనేక రకాల ఔషధగుణాలు ఉండటం విశేషం. 4వేళ ఏళ్ల క్రితం నుంచే రేగు పండ్లను మానవాళి ఎంతో ఇష్టంగా తింటుందని చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం రేగు పండ్లు పుష్కలంగా లభించే సీజన్. ఉష్ణమండల ప్రాంతాల్లో పెరిగే రామ్నేసి కుటుంబంలోని జిజిఫస్ జాతికి చెందింది. దీని శాస్త్రీయనామం జిజిఫస్ మార్టియానా. వీటిని తింటే రుచికి తియ్యతియ్యగా.. కాస్త పులుపుగా ఉండే రేగు పళ్లను నోట్లో వేసుకుని చప్పరిస్తుంటే అప్రయత్నంగానే కళ్లు అరమూతలు పడుతుంటాయి. రేగు పండ్ల రుచికి మంత్రముగ్ధుడైన మహావిష్ణువు ఒకనాడు రోజంతా రేగు పండ్లను తిని కడుపు నింపుకున్నాడట అందుకే ఆయనను బదరీ నారాయణుడు అని కూడా పిలుస్తారు. భారతదేశంలో 90 రకాల రేగుజాతులు అందుబాటులో ఉన్నాయి. మొదట చైనాలో మాత్రమే లభించిన రేగు పండ్లు ఆ తర్వాత అమెరికా, ఇండియా, శ్రీలంక, అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ దేశాలను కూడా చుట్టేశాయి. పెరుగుతున్న ఆధునిక వంటల విధానాల్లో రేగు పండ్లను భారతీయులు అనేక ఆహార రుచులతో ఆస్వాదిస్తున్నారు. జామ్, జెల్లీ, పానీయాల తయారీలోను, స్వీట్లు, సలాడ్స్‌లో వినియోగిస్తున్నారు.

అనుమతిలేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

● జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

పెద్దవంగర, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్ దుకాణాల్లో అనుమతిలేని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. గురువారం చిట్యాలలో ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తన నిల్వలు, నాణ్యతతోపాటు రిజిస్టర్‌లను, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీరైతు సాగుచేసే పంటల వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు అప్రమాత్తంగా ఉంటూ నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలన్నారు. మరిపెడ ఏడీఏ విజయచంద్ర, మండల వ్యవసాయాధికారి గుగులోత్ స్వామినాయక్, ఏఈవో రాజు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు


తీగజాతి కూరగాయల వేరుశనిగను పరిశీలిస్తున్న విజయనిర్మల

నర్సింహులపేట, (ఆంధ్రజ్యోతి) : సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల అన్నారు. గురువారం నర్సింహులపేట మండలంలోని పెద్దనాగారం స్టేజీ వరి, మొక్కజొన్న, వేరుశనగ, తీగజాతి కూరగాయల సాగును పరిశీలించారు. ఆహార భద్రత మిషన్ పథకంలో ఫాస్పరస్ సొల్యూబుల్లైజింగ్ బ్యాక్టీరియా, సుడోమోనస్ బ్యాక్టీరియా పొడిని రాయితీపై పలువురు రైతులకు పంపిణీ చేశారు. సీజనల్‌గా వ్యాపించే చీడపీడలపై బాధిత రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏవో వినయ్‌కుమార్, ఏఈవో బాబు, మాజీ సర్పంచ్ బొబ్బ సోమిరెడ్డి, రైతులు ఉన్నారు

తండ్రికి బాలిక అప్పగింత

కాజీపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో వారితో గొడవపడి పారిపోయి వచ్చిన బాలికను రైల్వే పోలీసులు గుర్తించి తండ్రికి అప్పగించారు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్‌కు చెందిన నందిని అనే విద్యార్థిని బొల్లికుంటలోని ఓ కాలేజీ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. తల్లి ఇంట్లో నుంచే కాలేజీకి వెళ్లమని మందలించడంతో నందిని ఇంటి నుంచి పారిపోయి తండ్రికి ఫోన్‌చేసింది. తాను కాజీపేట రైల్వేస్టేషన్ ట్రాక్‌పై ఉన్నానని, ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటున్నానని బాలిక తండ్రికి ఫోన్‌చేసింది. నందిని తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఉన్నతాధికారులు ఆదేశాలతో రైల్వే కానిస్టేబుల్ ఆర్.కమలాకర్ కాజీపేట ఆర్ఆర్ఐ క్యాబిన్ వద్ద బుధవారం అర్ధరాత్రి నందినిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బాలికను తండ్రికి అప్పగించారు.

ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించండి

● మానుకోట మునిసిపల్ కమిషనర్ రవీందర్


మునిసిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్ల సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

మహబూబాబాద్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి అనధికార లే అవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించుకుని ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీ పొందాలని స్థానిక మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్ అన్నారు. మార్చి 31 లోపు చెల్లించి ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో గురువారం టౌన్ ప్లానింగ్, వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలో 2020లో రూ.1000 చెల్లించి ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో 1361 మంది దరఖాస్తుదారులకు సంబంధించి ఫీల్డ్ లెవల్ సర్వే పూర్తయిందని వారంతా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు దారులకు ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించేందుకు 10 మందితో ఐదు బృందాలను ఏర్పాటు చేశామని, వారు దరఖాస్తుదారులకు ఫోన్ ద్వారా ఫీజు వివరాలు తెలిపి ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించే విధంగా వారికి అవగాహన కల్పించనున్నారని వివరించారు. మార్చి 31 వరకే రాయితీ పొందే అవకాశం ఉంటుందని, త్వరితగతిన చెల్లించి అనధికార లే అవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీపీవో సాయిరాం, టీపీఎస్ ప్రవీణ్, బాబు, మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ సదస్సును విజయవంతం చేయండి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ భవన్‌లో ఈ నెల 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సును విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో గురువారం మహిళా సదస్సు కరపత్రాలను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ సామాజిక, ఆర్థిక, రాజకీయ చిత్రపటంలో వ్యవస్థాపరమైన చెప్పుకోదగ్గ మార్పులు కనిపిస్తున్నాయని, దీని వెనుకాల దశాబ్దాల పోరాటాలు ఉన్నాయన్నారు. స్త్రీ అభివృద్దే దేశాభివృద్ది అనే నినాదంతో మార్చి 8న అంతర్జాతీయ మహిళా పోరాట దినాన్ని ఒక సామాజిక బాధ్యతగా తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రజల ముందుకు తీసుకువస్తుందన్నారు. 8న నిర్వహించే మహిళా సదస్సులో అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బలాష్టి రమేష్, రాచకొండ ఉపేందర్, విష్ణువర్దన్, గిరిజ, అంజయ్య, బిక్షపతి, విద్యాసాగర్, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, రమేష్ శ్రీను, రఫిక్, సరిరాం, ప్రకాష్ పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి

(5వ పేజీ తరువాయి)

సూచించారు. ప్రీఫైనల్ పరీక్షల అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు ఏ సబ్జెక్టులో ఎన్ని మార్కులు వచ్చాయి. ఏ సబ్జెక్టులో తక్కువ మార్కులు వచ్చాయి అని తెలియజేస్తూ వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ఏంఈవోలు, కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయులు పాఠశాలల సందర్శన వివరాలను యాప్‌లో పొందుపరచాలన్నారు. డీఈవో వెంట ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, డీఎస్వో అప్పారావు ఉన్నారు.

అడవికి రక్షణ.. ఫైర్‌లైన్స్

(5వ పేజీ తరువాయి)

ఎక్కువగా ఉంటుందని భావిస్తున్న అటవీ శాఖ అధికారులు ఫైర్‌లైన్లను ఏర్పాటు చేసి, వాటిని సంరక్షించే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలో తునికాకు సేకరణ కూడా జరగనుంది. దీంతో అడవిలోకి వెళ్లే కూలీలు, రోడ్డు మార్గం ద్వారా ప్రయాణికులు ధూమపానం చేస్తూ నిప్పును ఆర్పకుండా పడేస్తారు. ఈ క్రమంలో అడవులకు నిప్పంటుకునే ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయి. ఫైర్‌లైన్ల ద్వారా నిప్పంటుకునే ప్రమాదాలు చాలా తక్కువగా ఉండటంతో పాటు ఒకవేళ నిప్పంటుకున్నా మంటలను ఆర్పేందుకు ఫైర్‌లైన్లు దోహదం చేస్తాయి. గత నెల రోజులుగా వివిధ రేంజ్‌ల పరిధిలో ఎఫ్‌డీవోలు, రేంజ్ అధికారుల ఆధ్వర్యంలో ఈ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందుకోసం ప్రతి అటవీశాఖ రేంజ్ పరిధిలో ఇప్పటికే 8 మందిని టీంగా ఏర్పాటు చేసి నిరంతరం అడవుల్లో గస్తీ ఏర్పాటు చేశారు. వీరు ఆయా ప్రాంతాల్లో మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటారు. సిబ్బంది ఫైర్‌లైన్లు ఏర్పాటు చేయడం, లైను ఏర్పడే వరకు రక్షణగా అక్కడే కాపలా ఉంటారు.

అటవీ సంపద రక్షణకు..

అటవీ ప్రాంతంలో ఫైర్‌లైన్ల ద్వారా అడవిలో ఉండే వృక్షాలు, ఇతర అటవీసంపద, జంతు రక్షణకు సైతం చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి అటవీ ప్రాంతంలో జంతువుల సంచారం అధికంగా ఉండటంతో, ఫైర్‌లైన్లు ఏర్పాటు చేస్తే అడవిలో వేసవిలో సైతం జంతువులు స్వేచ్ఛగా సంచరించేందుకు వీలు ఏర్పడుతుందని అధికారులు తెలుపుతున్నారు.

చైతన్య కార్యక్రమాలు..

వేసవి కాలంలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు గ్రామంల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే గ్రామాల్లో అగ్ని ప్రమాదాలపై ౹అడవికి నిప్పు-పర్యావరణానికి ముప్పు' పేరిట కార్యక్రమాలు చేపడుతున్నారు. అడవులు దగ్ధం అయితే మానవాళికి ఏ విధంగా నష్టం జరుగుతుందనే దానిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. అడవుల్లో మంటలు వ్యాపించినట్లయితే తక్షణమే మంటలు ఆర్పేలా చర్యలు తీసుకుంటున్నారు.

బాలికను చేరదీసిన అధికారులు

గూడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాజనపల్లిలో ఓ అనాథ మైనర్ బాలికను చైల్డ్‌వెల్ఫేర్, మహిళ శిశు సంక్షేమశాఖ అధికారులు చేరదీసినట్లు గూడూరు సీడీపీవో నిలోఫర్ అజ్మి తెలిపారు. గురువారం గ్రామస్థులు అనాథ మైనర్ బాలికను చేరదీయాలని 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌ను సంప్రదించినట్లు పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న మహిళ శిశు సంక్షేమశాఖ, చైల్డ్‌వెల్ఫేర్ అధికారులు ఆ బాలికను చేరదీసినట్లు చెప్పారు. అంగన్‌వాడీ టీచర్ సహకారంతో మహబూబాబాద్ బాలరక్షాభవన్‌కు తరలించినట్లు చెప్పారు. చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ముందు బాలికను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అనంతరం మహబూబాబాద్ బాలసదనానికి తరలించినట్లు పేర్కొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

నెల్లికుదురు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 8న మహబూబాబాద్ టీపీటీఎఫ్ భవనంలో నిర్వహించే మహిళా ఉపాధ్యాయుల సదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ తెలిపారు. నర్సింహులగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం టీపీటీఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. పద్మావతి, హరినాథ్, మమత, పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


జమాండ్లపల్లిలో ముదిరాజ్ పెద్దమ్మతల్లి గుడి నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లిగుడి నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్థులు ఏ కార్యక్రమం చేపట్టిన మొదట కుల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లి ఆశీర్వాదం తీసుకోవాలని చెప్పారు. గ్రామస్థులు రవీంద్రాచారి, సుదర్శనచారి, నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, పాపాచారి, ముదిరాజ్ కులపెద్దలు గొడుగు ఉపేందర్, రేగుల రాంమూర్తి, ముదిరాజ్ కులస్థులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలి

డోర్నకల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పార్కును పరిశుభ్రంగా ఉంచి అందులో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. గురువారం డోర్నకల్ మునిసిపల్‌కేంద్రంలోని అచార్య జయశంకర్ పార్కును ఆయన సందర్శించారు. వేసవికాలం అయినందున పార్కులో పచ్చదనం పెంపొందించే విధంగా రోజు చెట్లకు నీరు అందించాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పార్కును ప్రతి రోజు తెరిచి ఉంచాలని, పార్కులో వాకింగ్ ట్రాక్ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎంతమంది సందర్శకులు వాకింగ్‌కు వస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంకట్‌సింగ్‌తండాలోని జీపీఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో ఇద్దరు విద్యార్థులే ఉండడంతో ఉపాధ్యాయురాలును విద్యార్థులు ఎందుకు తక్కువగా ఉన్నారని ప్రశ్నించారు. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నందున పిల్లల హాజరుశాతం తక్కువగా ఉందని ఆమె అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వంటగది, మరుగుదొడ్లు, తాగునీటిని పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

వాహనాలు అనుమతించాలంటూ రైతుల ఆందోళన


రైతులతో మాట్లాడుతున్న సీఐ దేవేందర్

మహబూబాబాద్‌రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లోకి సమయం కాకముందే మిర్చి విక్రయానికి వాహనాల్లో వచ్చిన రైతులను మార్కెట్ సిబ్బంది లోనికి అనుమతించలేదు. మిర్చి విక్రయించుకోవడానికి తీసుకువచ్చిన వాహనాలను లోనికి అనుమతించాలంటూ గురువారం రాత్రి రైతులు ఆందోళన చేపట్టారు. ఇతర ప్రాంతాల నుండి అద్దెలు చెల్లించుకొని వాహనాలను తీసుకువస్తేలోనికి అనుమతించకపోవడంతో ఆగ్ర హించిన రైతులు వాహనాలు రోడ్డు పైనే నిలిపి ఆందోళన చేపట్టారు. దీంతో రహదారి వెంటా లోడుతో వచ్చిన వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ విష యం తెలుసుకున్న టౌన్ సీఐ దేవేందర్ మార్కెట్ వద్దకు చేరుకొని మార్కెట్‌లో మిర్చిని విక్రయించుకునే రైతులు కేవలం రాత్రి 9 గంటల తరువాతనే మార్కెట్‌లోకి తీసుకురావాలని సూచించారు. ఉద్దేశపూర్వంగా వాహనాలను నిలిపివేయడం లేదని మార్కెట్ సమయాల ప్రకా రమే లోనికి అనుమతిస్తారని రైతులకు సర్ది చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు

మహబూబాబాద్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యాలకు హాని కలిగించే ప్లాస్టిక్‌కవర్లను విక్రయిస్తే చర్యలు తప్పవని మునిసిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్ హెచ్చరించారు. మహబూబాబాద్‌లో గురువారం అధికారులు, సిబ్బంది పలు షాపుల్లో దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న షాపుల యాజమానులకు రూ.3 వేల జరిమానా విధించారు. అనంతరం కూరగాయల మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దంటూ వ్యాపారులకు నోటీసులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్వీరాన్‌మెంటల్ ఇంజనీర్ క్రాంతి, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై అవగాహన సదస్సు

తొర్రూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు మునిసిపల్ కమిషనర్ శాంతి కుమార్ అన్నారు. గురువారం లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీంపై తొర్రూరు మునిసిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ శాంతికుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఎల్ఆర్ఎస్ బాధితుడు వారి భూములను చట్టబద్ధత ఎల్ఆర్ఎస్ చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందించే చక్కటి అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 2018-20 సంవత్సరంలో దాదాపు 25లక్షల మంది ఎల్ఆర్ఎస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, వారి భూములను ఎలాంటి వివాదాలు లేకుండా ఉండేందుకు వారు నిర్మించుకునే గృహాలకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు ఎల్ఆర్ఎస్ ఉపయోగపడుతుందన్నారు. డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రమేష్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యపై కేసు నమోదు

బయ్యారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడగా, బయ్యారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన జలగం అన్వేష్ (33) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే భార్యాభర్తల నడుమ తలెత్తిన మనస్పర్దలతో మనస్తాపం చెందిన అన్వేష్ గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు, ఇరుగుపొరుగు వారు చికిత్స నిమిత్తం అన్వేష్‌ను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, మృతుడి తల్లి ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య కల్యాణి, పిల్లలున్నారు.

అనారోగ్యంతో అల్లి శ్రీనివాస్‌రెడ్డి మృతి

మహబూబాబాద్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, మానుకోట టూటౌన్ కార్యదర్శి అల్లి శ్రీనివాస్‌రెడ్డి (55) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల సీపీఎం జిల్లా కమిటీ సంతాపం ప్రకటించింది. విద్యార్థి దశ నుంచే వామపక్ష విద్యార్థి ఉద్యమాల్లో పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులుగా, టూటౌన్ కార్యదర్శిగా పని చేస్తున్నారు. శ్రీనివాస్‌రెడ్డి మృతి సీపీఎం పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మానుకోటలో అంతిమ యాత్ర ఉంటుందని తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో నలంద విద్యార్థుల ప్రతిభ


జాగృతి రాపర్తి అమృత కోడి మానస

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ రెగ్యులర్ 1, 3, 5 సెమిస్టర్ ఫలితాల్లో మహబూబాబాద్ నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ డాక్టర్ జోలి సత్యనారాయణ, డైరెక్టర్ జోలి సాధన, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ గురువారం తెలిపారు. ఈ నెల 5న విడుదల చేసిన డిగ్రీ సెమిస్టర్ బీఎస్సీ మ్యాథ్స్ ఫలితాల్లో కోడి మానస 9.02 జీపీఏ, రాపర్తి అమృత 8.69, చల్లా జాష్వా 8.16 రామగిరి హేమ 8.30, షాహియా షఫ్రిన్ 8.30, యల్లిమందల తేజస్వీ 8.11, కోవిల చందన 8.03 జీపీఏ సాధించినట్లు తెలిపారు. బీఎస్సీ బీజడ్సీ విభాగంలో కట్ల మానస 8.06, శ్రీరామోజు జాగృతి 8.60, నంద రుచిత 7.84, తాళ్ల అనూష 7.81, మహ్మద్ ఆసిన్‌బేగం7.79, చిటారి రమ్య 7.38 జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. బీకాం కంప్యూటర్ విభాగంలో చింత హర్షిత 8.40, బానోతు అంకిత 8.32, దేశబోయిన పవన్‌కుమార్ 7.93, లోచన 7.86, తీగల రామకృష్ణ 7.86, జాహ్నవి 7.62, లోయ ప్రణీత 7.75 జీపీఏ సాధించినట్లు తెలిపారు. బీఏ విభాగంలో మహ్మద్ సుమయ్య 7.68, నరేటి వర్షిత 7.53, వాంకుడోతు సోనియ 7.48, మోడెం అంజన 7.42, భూక్య నందిని 7.41 జీపీఏతో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఆత్మహత్యల నివారణ అందరి బాధ్యత

● ఆత్మహత్యల నివారణ కమిటీ రాష్ట్ర చైర్మన్ అశోక్


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ సభ్యులు

కొత్తగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ఆత్మహత్యల నివారణ అందరి సామాజిక బాధ్యత అని సైకాలజిస్ట్, ఆత్మహత్యల నివారణ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ సూచించారు. మండలంలోని గుంజేడు దేవస్థానం వద్ద గురువారం నిర్వహించిన ఆత్మహత్యల నివారణ కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ సభ్యులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఆత్మహత్య యత్నం చేసుకునే వ్యక్తుల పట్ల సమాజం స్వాంతన చేకూర్చి, మానసిక ధైర్యం నింపాలని సూచించారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలకమారి వెంకటేశ్వర్లు, లయన్స్‌క్లబ్ మెంబర్ అనుమాల వెంకటేశ్వర్లు, పద్మశాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామల నరసయ్య, విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్, విశ్రాంత ఆచార్యులు మూల్కా కృష్ణమూర్తి, బొమ్మ వెంకటేశ్వర్లు, భరత్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీపై సామాజిక తనిఖీ

డోర్నకల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలంలోని వివిధ గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల వివరాలు, వాటికి చెల్లించిన నగదు వివరాలపై శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. కావునా ఆయా గ్రామాలకు సంబంధించిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

కురవి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు డిమాండ్ చేశారు. ఈ మేరకు కురవిలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీహెచ్ఎస్ పాతభవనాన్ని కూల్చిన స్థలంలో జూనియర్ కళాశాలను నిర్మించాలని, ఇందుకు స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కొలిపాక వీరేందర్ పాల్గొన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో ఎస్పీ ప్రత్యేక పూజలు

కురవి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కురవి శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో ఎస్పీ దుంగ్రోత్ నాగరాజు గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని వీరభద్రస్వామి ఆశీస్సులు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజేయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్, రాజునాయక్ పాల్గొన్నారు.

'పరిహారం చెల్లించిన తర్వాతే భూములు స్వాధీనం చేసుకోవాలి'

గార్ల, మార్చి 6 9ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మద్దివంచ గ్రామ సమీపంలో రైల్వే మూడోలైనుతోపాటు అండర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగం పంట భూములకు నష్ట పరిహారం అందించిన తర్వతే భూములు స్వాధీనం చేసుకోవాలని అప్పటివంటలు ధ్వంసం చేయడం సరికాదని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ అన్నారు. గురువారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో భైములు కోల్పోయిన రైతులతో కలిసి పని ప్రదేశంలో ఆందోళన చేపట్టారు. కాంట్రాక్టర్లు 18 మంది సాగు రైతుల భూముల్లో మట్టి కుప్పలుపోసి పంటలను నాశనం చేస్తూ రైతులను తీవ్రంగా నష్ట పర్చడం జరుగుతుందన్నారు. రైతులకు నష్ట పరిహారం అందించే వరకు రైతుల పక్షాన న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌని మల్లేశ్, ముక్క రంగయ్య, కుసిని బాబురావు, చెవుకాయల పిచ్చయ్య, శ్రీను, కృష్ణయ్య, చోటే మియా, పాల్గొన్నారు.

రాయల స్ఫూర్తితో దోపిడీపై పోరాడుదాం

గంగారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కామ్రేడ్ రాయల సుభాస్‌చంద్రబోస్ సమరత్వ స్పూర్తితో దోపిడీపై పోరాడుదామని మమబూబాబాద్ జిల్లా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. గురువారం గంగారం మండలం తిరుమలగండి గ్రామంలో కామ్రెడ్ రాయల సుభాస్‌చంద్ర బోస్ తొమ్మిదవ వర్ధంతి సభలో ఆయనకు నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడారు. ఈ మేరకు ఈనెల 7నుంచి 9 వరకు మండలంలో ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూనెం ప్రభాకర్, రమేష్, పట్నాయక్, సతీష్ చందర్, జోగా వెంకటయ్య, పాపయ్య, జజ్జర సమ్మయ్య, నర్సింహరావు, వెంకటేష్, రవి, లక్ష్మీ పాల్గొన్నారు.

కూలీలకు ఈజీఎస్ పనులను కల్పించాలి

దంతాలపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీలకు సత్వరమే ఈజీఎస్ పనులు కల్పించాలని ఎంపీడీవో వివేకాం అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశంలో మాట్లాడుతూ వందరోజుల పని దినాలు కాని వారి జాబితాను తయారు చేసి గుర్తించిన పనులను చేపించాలన్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్ సిబ్బంది రోజువారి డాటాను ఎంపీడీవో కార్యాలయానికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ ప్రవీణ్, ఫీల్డ్అసిస్టెంట్‌లు వెంకన్న, మధు, రంజిత్, జగన్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ గెలుపు ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి నాంది

తొర్రూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి గెలుపు ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి నాంది అని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల సతీష్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం తొర్రూరులో శ్రీపాల్‌రెడ్డి గెలిచిన సందర్భంగా బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, ఏరియర్స్, ఇతర బిల్లులు, గురుకుల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు జీవో నంబర్ 01 ద్వారా వేతనాలు అందించేందుకు పీఆర్టీయూ కృషి చేస్తుందని తెలిపారు. కేజీవీబీ సమగ్ర శిక్షణ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్, తదితర సమస్యల పరిష్కారానికి శ్రీపాల్‌రెడ్డి మండలిలో కృషిచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు విప్లవ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముత్తిలింగం, రమేష్, సురేష్, మధు ఉన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

తొర్రూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల సౌకర్యం కోసం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరులోని లయన్స్ భవన్‌లో మెడికవర్ ఆస్పత్రి వైద్యులచే ఉచిత గుండె పరీక్షల వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ప్రాంత ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సుమారు 100 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యుడు వెంకట్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్ కుమార్, కార్యదర్శి తమ్మి రమేష్, కోశాధికారి శంకర్, విశ్వేశ్వర రావు, లక్ష్మి నర్సింహారావు, శారద, సురేష్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నర్సింహులపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కౌసల్యదేవి పల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పాఠశాలకు చెందిన పలువురు విద్యా ర్థులు ఎంఈవోగా భానుప్రకాష్, హెచ్ఎంగా సుశాన్వి, ఉపాధ్యాయులుగా శ్రావిక, శ్రావ్య, శ్రీనిధ్య, మన్విత్ బాధ్యతలు నిర్వహించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల విద్యాశాఖ ఆధికారి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పట్టుదలతో చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్యాభ్యాసం జరు గుతుందన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం ఎ.అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు జి.ప్రభాకర్, ఎస్.రాములు, ఎన్.శ్యామ్‌సుందర్‌రెడ్డి ఉన్నారు.